మరో ప్రజా సంకల్పం

Maro Praja Sankalpam • Main Edition

# ఉపాధి కూలీల రూ.493 కోట్ల బకాయిలు చెల్లించాలి

■ **కరువు మండలాలకు అదనపు నిధులు ఇవ్వాలి : వెన్నపూస రవీంద్రరెడ్డి**

**తాడేపల్లి:** ఉపాధి హామీ కూలీలకు పెండింగ్‌లో ఉన్న రూ.493 కోట్ల బకాయిలను తక్షణమే చెల్లించాలని వైయస్‌ఆర్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రరెడ్డి డిమాండ్ చేశారు. వైయస్‌ఆర్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ కరువు మండలాలుగా ప్రకటించిన ప్రాంతాల్లో రైతులు, రైతు కూలీలను ప్రభుత్వం ఆదుకోవడంలో విఫలమైందని మండిపడ్డారు.

ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి రూ.132 కోట్లు, జూలై నుంచి కొత్త చట్టం కింద పనిచేసిన కూలీలకు రూ.361 కోట్లు కలిపి మొత్తం రూ.493 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందని తెలిపారు. కూలీలకు సకాలంలో వేతనాలు అందించలేని దుస్థితిలో కూటమి ప్రభుత్వం ఉందని విమర్శించారు. రాష్ట్రంలోని 413 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించిన నేపథ్యంలో అదనపు కేంద్ర నిధులు తీసుకురావాలని, గ్రామాల్లో తాగునీరు, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు.



## ఆర్థిక సంఘం నిధులపై సమాధానం చెప్పాలి

15వ ఆర్థిక సంఘం కింద విడుదలైన నిధులను గ్రామాల అభివృద్ధికి పూర్తిస్థాయిలో వినియోగించలేదని వెన్నపూస రవీంద్రరెడ్డి పేర్కొన్నారు. 16వ ఆర్థిక సంఘం ద్వారా రాష్ట్రానికి రావాల్సిన దాదాపు రూ.12 వేల కోట్ల నిధుల నేపథ్యంలోనే స్థానిక సంస్థల ఎన్నికలను హడావుడిగా నిర్వహిస్తున్నారనే అనుమానం కలుగుతోందని ఆరోపించారు. గ్రామీణ మౌలిక వసతులు, తాగునీటి సమస్యల పరిష్కారానికి నిధులను వినియోగించాలని స్పష్టం చేశారు.